

– డాక్టర్ కె.వి.ఎస్. రామారావు

"రామా చిలుకమ్మ ప్రేమా మొలకమ్మ రాధమ్మా!''

తనకి తెలియకుండానే పాటలొచ్చేస్తున్నాయి ప్రణయ్‌కి. పట్టలేని ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోతున్నాడు.

వంటింట్లోంచి ఫామిలీ రూంలోకి, అక్కడి నుంచి హోం ఆఫీసు రూంలోకి, అట్నుంచి మళ్ళీ వంటింట్లోకి – ఎక్కడా ఒక్క నిమిషం నిలవలేకపోతున్నాడు.

వంటల ఘుమఘుమ వాసనలు ఇంటిని చుట్టేస్తున్నాయి లోపలా బయటా!

కాకరగాయ వేపుడు పూర్తయింది.

టొమోటో పప్పు రడీ!

బంగాళాదుంప కూర సిద్ధం.

ఏదీ పులిహోర? ఇప్పుడెలా ఉందో దాని పరిస్థితి?

స్పూన్‌తో తీసుకుని రుచి చూశాడు.

ఊ... దీన్లో ఇంకొంచం పులుపు రావాలి. చింత పండు పులుసు ఇంకాస్త కలుపు!

ఆహా! అద్భుతంగా ఉంది కదా ఇప్పుడీ రుచి!

ఈ దేశంలో ఒంటరిగా రెండేళ్ళు ఉండటం వల్ల కలిగిన ఉపయోగాల్లో ఇదొకటి - వంటల్లో ఎక్స్‌పర్ట్ అయిపోయాడు తను.

నలభీమ పాకాలూ ఎలా ఉంటాయో చూడాలంటే ఈ ప్రణయ్ వంటని రుచి చూడా ల్సిందేనోయ్! లలలా...

ఆరు గంటలు కావొచ్చింది.

ఇంకెంత - కొద్ది నిమిషాలే!

రాధ వచ్చేస్తూంటుంది!

నా డాలర్ల కొండ రాధ! నా బి.ఎం.డబ్ల్యూ. కారు రాధ!! నా స్టాక్‌ల జాక్‌పాట్ రాధ!!!

లలలా లలలలలా వచ్చేస్తోంది రాధ వచ్చేస్తోంది!


రెండేళ్ళుగా ఎప్పుడెప్పుడని ఎదురు చూసిన రోజు వచ్చేసిందొచ్చేసింది! రాధకి ఆఖరి పరీక్ష అయిపోయిందయిపోయింది!!

మార్కెట్లోకి వలవిసిరి డాలర్ల చేపల్ని గంపల కెత్తుకునే సమయం వచ్చేసిందొచ్చేసిందొచ్చేసిం దొహో!!! ''భలే మంచి చౌక బేరమూ...'' ఎక్క డిదీ వెధవ పాట - ఎప్పుడూ యాభైల్లోదిలా ఉంది! ''నా మనసెయ్... సెయ్... సెయ్...' ఒహ్హోహ్హో హ్హోహ్హో...

రెండేళ్ళనాడు, ఫిజిక్స్ ఎం.ఎస్సీ. యే అయినా గానీ కళ్ళు మిరుమిట్లు గొలిపే అందంతో పెళ్ళి చూపుల్లో తనని మంత్రించి ఏదో లోకంలో పడేసి ముందూ వెనకా ఆలోచించకుండా డాక్టర్లనీ కంప్యూటర్ ఇంజనీర్లని కాదని పట్టుపట్టి తననే పెళ్ళి చేసుకునేలా హిప్నటైజ్ చేసిన రాధ! బిడియం గా భయం భయంగా తనతోపాటు ఈ కొత్త దేశానికి, కొత్త జీవితానికి కదిలి వచ్చిన రాధ!

ఏ కంప్యూటర్ ఇంజనీర్‌నో చేసుకుని ఉంటే ఈ రెండేళ్ళలో టేక్సులు పోగా కనీసం డెబ్బై ఎనభై వేలు చేతికొచ్చుండేవి. అంత డబ్బు వదులుకుని కేవలం నాలుగు లక్షల కట్నంతోనే రాధని పెళ్ళి చేసుకున్న తను త్యాగమూర్తా మజాకానా? ''త్యాగశీలి వమ్మా మహిళా'' -- ఛీ ఛీ ఏమిటీ వెధవ చెత్త పాత డొక్కు పాటలిలా వస్తున్నా ఇలాంటి సంతోష కరమైన రోజున?

పెళ్ళయి తిరిగి వస్తున్నప్పుడే దార్లో ఎయిర్ ప్లేన్‌లోనే తయారు చేశాడో చక్కడి ప్లేన్. బోస్టన్‌లో దిగీ దిగటంతోటే ఏదో ఒక కమ్యూనిటీ కాలేజీలో ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సుల్లో చేర్పించాలి (రాధ ఇంగ్లీష్ అప్పట్లో తనకన్నా అధ్వాన్నంగా ఉండేది! డింకీలు




కొట్టుకుంటూ ఎలానో ఎం.కామ్ అయిపోయిం దనిపించిన తనకన్నా!). అదో రెండు మూడు నెలలు పడుతుంది. అప్పుడే టోఫెల్, జి.ఆర్.ఇ పరీ క్షలకి ట్యూషన్ ఇప్పించాలి. అదెన్నాళ్ళు పడు తుందో? వీటన్నిటికీ కలిసి ఓ రెండు వేల దాకా వద లొచ్చు. ఏం చేస్తాం, తప్పదు మరి. లాంగ్‌టరం ప్లానింగ్ అంటే అదే కదా - ఇప్పుడు పెట్టే చిన్న పెటు బడితో ముందు ముందు వందల రెట్లు సంపాయిం చటం! ఎంత చెత్తదైనా సరే దగ్గర్లో ఉన్న ఏదో ఒక యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ఎం.ఎస్. లో చేర్పించాలి.

ఒక వేళ సీటు రాకపోతేనో?

ఇంకెవన్నా ఉందా? ప్లాన్లన్నీ తల్లకిందులై కొంపలు మునిగిపోయి చాలా సీరియస్ చర్యల గురించి (విడాకులివ్వటం లాటివన్న మాట!) ఆలోచించాల్సొస్తుందప్పుడు. కనక, రాత్రింబగళ్ళు గట్టిగా చదివించి రోజుకో కొత్త టెస్ట్ ప్రాక్టీస్ చేయించి జి.ఆర్.ఇ.లో మంచి స్కోర్ వచ్చేట్లు చెయ్యాలి ఎలాగైనా సరే!

ఎం.ఎస్సీలో యూనివర్సిటీ ఫస్ట్ తెచ్చుకున్నది ఆపాటి చదవలేదా? అఫ్ కోర్స్ అది ఫిజిక్స్‌లో ననుకో - అయినా కాస్తో కూస్తో బుర్ర వుండే ఉండాలి.

నిజానికి కాస్తాకూస్తా కాదు బోలెడంత బుర్ర ఉన్నట్టు తేలింది రాధకి!

టోఫెల్, జి.ఆర్.ఇ.లని అప్పడాల్లా నవిలేసి అవలీలగా రాసేసి రెంటిలోనూ బోల్డన్ని మార్కులు తెచ్చుకోవటమే కాకుండా అప్లై చేసిన అన్ని యూనివర్సిటీల్లోనూ అడ్మిషన్ కొట్టేసింది! వాటిలో రెండు మంచి యూనివర్సిటీలు స్కాలర్ షిప్‌లు కూడా ఇచ్చాయి!

సెహభాష్! ప్రణయ్ - అదృష్టమంటే నీదో నోయ్!

ఇప్పుడే ఇలా వుందే, ఇంక ఏ ఏడాదిలోనో ఎం.ఎస్. పూర్తి చేశాక, ఇక చూసుకో - ఉద్యోగం మేమిస్తాం అంటే మేమిస్తాం అని పెద్ద పెద్ద కంపెనీ లన్నీ క్యూలు కట్టి నిలబడబోతున్నయ్ నీ ఇంటి ముందు!

ఏడాదిన్నర పట్టింది కోర్స్ పూర్తవటానికి. ఇవేళే ఆఖరి రోజు. చివరి పరీక్ష అయిపోయి ఉం డాలి ఈపాటికి. రేపట్నుంచే ఇక ఉద్యోగాల వేట. కళ్ళకద్దుకుని ఇస్తాడు ఎవడైనా సరే, ఇవ్వక చస్తాడా? 'జావా'లో అయితేనేం, 'వెబ్ డిజైన్'లో నైతేనేం, 'ఈ కామర్స్'లో నైతేనేం - రాధ ఎక్స్‌పర్ట్ అయి పండి పోయిందప్పుడే! ఏ ఇంటర్నెట్ స్టార్టప్ కంపెనీలో చేరినా అదృష్టం బాగుంటే ఏడాత్తిరకుండానే మల్టీ మిలియనీర్ కావొచ్చు.

''ఏదో ఒక రాగం పలికిందీ ఈ వేళా...''

వంటంతా పూర్తయింది.

వంటకాలు డైనింగ్ టేబుల్ మీద బారులు తీరి కూర్చున్నాయి.

పోపుల వాసనలు బుర్రంతా నిండిపోతున్నాయి.

ఇంకా రాదేం రాధ?

కొంపదీసి ఏ యాక్సిడెంటో కాలేదు కదా!

దేవుడా! అలాటి పని మాత్రం చెయ్యొద్దు. పోగొట్టుకున్న డబ్బు, ఇప్పటిదాకా పెట్టిన పెట్టుబడి అంతా పూర్తిగా వచ్చే వరకైనా ఎలాంటి అఘాయి త్యాలూ చెయ్యొద్దు. మిలియన్ల డాలర్ల కామధేను

వుని సరిగ్గా కోరికలు తీర్చబోయే సమయానికి దూరంగా లాగెయ్యకు. కావాలంటే తొలి మిలియన్ రావటం తోటే పిట్స్‌బర్గ్‌కి నీ గుడికి వస్తాగా? అందు కోసమన్నా ఆ మిలియనూ తొందరగా వచ్చేట్టు చూడు.

అబ్బ! ఈ మసాలాల వాసనల్తో ననుకుంటా కడుపులో వికారం కలుగుతోంది! దానికితోడు ఈ నెగెటివ్ ఆలోచనలు!

బాత్రూంకి పరిగెత్తాడు.

బయట తలుపు తెరిచిన శబ్దం.

వచ్చేసింది రాధ వచ్చేసింది!

వచ్చేస్తున్నా నేనొచ్చేస్తున్నా!

మెట్లెక్కుతోంది.

అక్కడే ఉండు, ఇప్పుడే వచ్చేస్తున్నా న్నేనొచ్చేస్తున్నా.

ఇంతలోనే మెట్లు దిగుతోందే!

అప్పుడే బట్టలు మార్చుకుందా? లేదు. పుస్త కాలు పైన పడేసి వచ్చినట్టుంది. మొహం కూడా కడుక్కున్నట్టు లేదే!

మళ్ళీ మెయిన్ డోర్ తెరిచి మూసిన శబ్దం.

బయటేదో మరిచిపోయి ఉంటుంది!

తిరిగి తలుపు శబ్దం వినపడదే?

సెకన్లు యుగాల్లాగా కదుల్తున్నాయి.

హమ్మయ్య. వికారం చాలా వరకు తగ్గింది.

బాత్రూంలోంచి బయటపడి ఒక్క గెంతులో వెళ్ళి మెయిన్ ఎంట్రెన్స్ తలుపు తెరిచి చూశాడు.

ఏదో కారు చాలా స్పీడ్‌గా వెళ్ళిపోతోందక్కడి నుంచి.

అది రాధ కారు కాదు.

రాధ కారు డ్రైవ్‌వేలోనే పార్క్ చేసి ఉంది.

కానీ ఆ వెళ్ళే కార్లో రాధ ఉన్నట్టుందే!

డ్రైవర్ సీట్లో కాదు, పాసెంజర్ సీట్లో!

మరి డ్రైవ్ చేస్తున్నదెవరు?

అయ్యో, ఎవరైనా కిడ్నాప్ చేశారా ఏం ఖర్మ?

ఏం చెయ్యాలిప్పుడు? పోలీసులకి ఫోన్ చేస్తేనో?

వద్దు, వద్దు. మరీ తొందర పడొద్దు. అన్నీ చెడు ఆలోచనలేనా? ఒక వేళ రాధ లోపలే ఉందేమో! తలుపు తెరిచి మూసినంత మాత్రాన బయటికే వెళ్ళ క్కర్లేదు కదా!

గబగబా లోపలికి పరిగెత్తాడు. ఇల్లంతా వెదికి చూశాడు.

ఏదీ, ఎక్కడా కనడదేం?

బేక్ యార్డ్‌లో ఉందా? లేదు, ఆ తలుపు లోపలే లాక్ చేసి ఉంది!

ఏమిటిది, మెయిన్ డోర్ మీద లోపలివైపున అంటించి ఉన్న ఈ కాయితం? ఇదేదో అప శకునంలా ఉందే! ఎందుకు నా చేతులిలా వణుకుతున్నాయి? ఇలా మొహం నిండా చెమటలు కారుతున్నాయెందుకు? ఏదో చెడ్డ జరగబోతోంది.

కాదు, కాదు. ఊరికే ఏదో పని ఉండి అలా బైటికెళ్ళింది, ఆ మాటే రాసి ఉంటుందీ కాగి తంలో నేను కంగారు పడతానేమోనని!

''ప్రణయ్ గారికి -''

ఏమిటీ పిలుపు? వింతగా ఉందే! ఎప్పుడూ ''ఏవండీ'' అని తప్ప మరో రకంగా పిలిచెరగని రాధ నుంచా ఇలాటి పిలుపు? ఏదో ఘోరం జరిగిపోతోంది!

''ఆర్నెల్లు కలిసుంటే వారు వీరవుతారంటారు. మనం రెండేళ్ళు కలిసున్నాం మరి.

మీరేమాత్రం నాలా అయ్యారో తెలీదు గాని నేను మీలా కాకుండా ఉండటానికి ఎంతో కష్టపడా ల్సొచ్చింది!

అంతవరకూ మనుషుల మధ్య మమకారాల్ని, బాంధవ్యాల్ని, అనురాగాల్ని మాత్రమే చూసిన నేను, మీతో గడిపిన ఈ రెండేళ్ళ కాలంలోనూ మీలాటి కొందరి దృష్టిలో డబ్బుకున్న విలువనీ, డబ్బు తప్ప మరొకటి ఉంటుందని గుర్తించలేని వ్యక్తి త్వాల్ని చాలా దగ్గరగా చూశాను.

గుర్తుందా, మీ ఫ్రెండ్ గోపీకి స్టాక్ మార్కెట్లో మీకన్నా ఎక్కువ లాభం వచ్చిందని తెలిసిన రోజు మీరెంత బాధపడిపోయారో?

అతనికి ఏ విధంగా నష్టం కలిగించాలా అని ఓ వారం పాటు కాలు కాలిన పిల్లిలాగా తిరుగుతూ ఆలోచించారు! అతని చెవిలో పోరీపోరీ ఓ చెత్త స్టాక్ అతని చేత కొనిపెట్టించే వరకు మీ బాధ చల్లార లేదు! ఇదీ మీ చిన్ననాటి స్నేహితుడికి మీరు చేసిన సహాయం!

మిమ్మల్ని విమర్శించటం, మీలో ఏవో పెద్ద పెద్ద బలహీనతలున్నాయని చెప్పటం కాదు నా ఉద్దేశం. అలా చెప్తే మీరేదో హఠాత్తుగా మారి పోతారనే లాటి అపోహలూ నాకు లేవు.

మీరున్న సోషల్ కమ్యూనిటీ అలాటిది. దాన్లో ఎవరెవరి స్టేటస్ ఏదో నిర్ణయించేది డబ్బే.

మీకు మాట్లాడుకుందికి, ఆలోచించేందుకి, బతికేందుకీ కూడా ఒకటే ఆధారం - డబ్బు!

అందుకే-

మీ దృష్టిలో నేనో తాళం వేసివున్న డాలర్ కట్టల సూట్‌కేసుని!

మీ కోరికల మర్రిచెట్టుకి నీరునీ, ఎండనీ!

మిలియన్ల డాలర్ల జాక్‌పాట్ లాటరీ టికెట్‌ని!

కానీ, ఇక్కడ సమస్య ఏమిటంటే -

నాకింకా మనసు చావలేదు. అనురాగం మీద మమకారం పోలేదు. జీవితానికి డబ్బే కాదు, ఇంకేదో అవసరమనే నమ్మకం ఇంకా పూర్తిగా ఇంకిపోలేదు!

అందువల్లనే -

నా భావాల్తో సానుభూతి వున్న వ్యక్తి -

దాదాపు సంవత్సరం నుంచి నన్నే ఆరాధిస్తున్న వ్యక్తి -

స్వయం కృషితో ఎన్నో మిలియన్లు సంపాయించి ఆ డబ్బంతా తను నమ్మిన మానవసేవా కార్యక్రమాల కోసం ఆనందంగా దానం చేసిన వ్యక్తి

ముప్పై ఏళ్ళకే ఒక జీవిత కాలపు అనుభవాల్ని సంపాయించి వచ్చేతరం భవిష్యత్తు కోసం జీవితం అంకితం చేస్తున్న వ్యక్తి -

అతని పేరు మీరు వినే ఉంటారు, అతని గురించి అప్పుడప్పుడు లోకల్ టీవీలో చూసి వుంటారు - బ్రయన్ మిల్లర్!

అతన్తో కలిసి జీవితం పంచుకోబోతున్నా.

అనుకోకుండా ఒకసారి యూనివర్సిటీ లైబ్రరీలో కలిశాం. అక్కడ్నుంచి కొద్ది కాలంలోనే ఆప్తులమయ్యాం.

వెనకబడ్డ ప్రాంతాల స్కూళ్ళలో మంచి విద్యని అందించటానికి ఇద్దరం కలిసి మా శాయశక్తులా పనిచెయ్యబోతున్నాం. ఈ పని నాకు ఎంతో తృప్తినీ, నా జీవితానికో అర్థాన్ని ఇస్తుందని నా నమ్మకం.

ఒకటి రెండు రోజుల్లో డివోర్స్ పేపర్స్ వస్తాయి. మరీ ఎక్కువ ఫైట్ చెయ్యకుండా త్వరగా తెములుస్తారని ఆశిస్తూ

- ఉంటాను

- రాధ''

కళ్ళు మసకలు కమ్ముతుండగా కుర్చీలో కూలబడ్డాడు ప్రణయ్.

ఏమిటిది? అందరిలా తనూ అందినంత డబ్బు ఎలాగైనా సంపాయించాలనుకోవటంలో తప్పేమిటి? డబ్బు కాక మనిషికి కావలసింది ఇంకేదో కూడా ఉందా?

ఎవరికి వాళ్ళు బాగుపడితే సమాజం అంతా బాగుపడక చస్తుందా?

ఇతరుల కోసం సొంత డబ్బునీ, భవిష్యత్తునీ ఇచ్చెయ్యాలనే ఇలాటి బూజుపట్టిన పురాతన భావాలున్న వాళ్ళు ఇంకా ఉన్నారా మన మధ్య?

భగవంతుడా! నీకు బుద్ధి లేదోయ్!